క్లుప్తంగా

పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి

వీరఘట్టం: ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఈవో బి.కోటీశ్వరరావు సూచించారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం స్థానిక బిల్లు కలెక్టర్లతో మాట్లాడి ఇంటి పన్నుకు సంబంధించి, ప్రతి గృహానికి డిమాండ్ నోటీసు అందజేయాలని ఆదేశించారు. వసూలు చేసిన పన్నుల మొత్తాన్ని పంచాయతీ అకౌంట్‌కు డిపాజిట్ చేసి, ఆ వివరాలు తెలియజేయాలన్నారు. బిల్లులు చెల్లించిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.

104 వాహనంలో ఆకస్మిక తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న 104 జిల్లా మేనేజర్ కృష్ణ

కొమరాడ: మండలంలోని మాదలింగి 104 వాహనంలో 104 జిల్లా మేనేజర్ కృష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని, వాహనంలో ఏ పరికరం పనిచేయకపోయినా మరే ఇతర సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో వాహనం ఉంచాలన్నారు.

కానిస్టేబుల్ మృతికి పలువురి సంతాపం



సీతంపేట: మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పాడి బాబూరావు(48) శుక్రవారం మృతి చెందారు. పాలకొండలోని తన స్వగృహంలో అనారోగ్యంతో మరణించగా ఆయన మృతి పట్ల పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ ప్రసాదరావు, ఎస్ఐ అమ్మన్నరావు సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాలకొండ రూరల్: పైడి సత్యప్రసాద్ మృతికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సంతాపం ప్రకటించారు. ఢిల్లీలోని తన నివాసంలో శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా మరణించారన్న వార్త తెలుసుకున్న సదరు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యప్రసాద్. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా, డీసీసీబీ డైరెక్టర్‌గా పనిచేశారని, సమైక్యాంధ్ర పార్టీ తరపున ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేశారని గుర్తు చేసుకున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

సీతంపేట: మండలంలోని అక్కన్నగూడలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

విద్యార్థులకు అభినందనలు

పాలకొండ రూరల్: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జామి రవి, సిబ్బంది అభినందించారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్‌లో చిన మంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి పాలవలస అరుణ్ అండర్-17 విభాగంలో సాఫ్ట్ టెన్నిస్‌లో సత్తా చాటగా, ఇదే పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి వావిలపల్లి జశ్వంత్ అండర్-14 క్రికెట్‌లో ప్రతిభ కనబరిచాడు. దీంతో వారిద్దరూ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నేత్ర శస్త్రచికిత్సకు పలువురి ఎంపిక



తోటపల్లి వైద్య శిబిరం వద్ద వృద్ధుడి కళ్లను తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి, గిజబ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పలువురు నేత్ర శస్త్రచికిత్సకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం శ్రీవేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి వచ్చిన వారి కళ్లను వైద్యుడు నిఖిల్ తనిఖీ చేశారు. అవసరమైన వారికి మందులు అందజేసి, కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు.

● ఛిద్రమైన రహదారి..



పార్వతీపురం నుంచి కూనేరు గ్రామం వెళ్లే అంతర్‌రాష్ట్ర రహదారి ఛిద్రమైంది. అడుగడుగునా గోతులే కనిపిస్తున్నాయి. ఈ దారిలో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోందని, వాహనాలు పాడవుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రోడ్డును చూపిస్తూ సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి గురువారం మాట్లాడారు. గతేడాది సంక్రాంతి నాటికి అద్దాల్లా మెరిసే రోడ్లు వేసి చూపిస్తామని చెప్పి, ఈ ఏడాది సంక్రాంతి వస్తున్నా పట్టించుకోవడం లేదని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటికైనా రోడ్లు బాగు చేయాలని కోరారు. -కొమరాడ

● గెడ్డ నీరే గతి..



కొమరాడ మండలం, కెమిశీల పంచాయతీ, గాజులగూడలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. తాగేందుకు గుక్కెడు మంచినీళ్లు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి కిలోమీటరు దూరంలోని చిన్న గెడ్డ నుంచి తాగేందుకు నీరు తెచ్చుకుంటున్నామని గిరిజనులు వాపోతున్నారు. గత మూడు రోజులుగా కరెంట్ సరఫరా లేకపోవడంతో గ్రామంలోని తాగునీటి పంపు మోటారు పనిచేయక ఇబ్బందులు పడుతున్నామన్నారు. లైన్‌మేన్‌కు ఫోన్ చేస్తే కాల్ లిఫ్ట్ చేయడం లేదని అధికారులు స్పందించి, తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. -కొమరాడ

● ముక్కు మూసుకోవాల్సిందే..



కురుపాం మండలం, శివ్వన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడ కుప్పలుతెప్పలుగా పారబోసిన చెత్తాచెదారం ఎండావానకు కుళ్లి భరించలేని దుర్వాసన కలిగిస్తోంది. అటువైపుగా వెళ్తున్న వారితో పాటు ప్రధానంగా విద్యార్థులు అక్కడకు వచ్చేసరికి ముక్కు మూసుకుని మరీ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీ అధికారులు స్పందించి, విద్యార్థులు అనారోగ్యం బారినపడక ముందే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, చెత్తను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. -కురుపాం

సారా మహమ్మారి.. అనారోగ్యానికి దారి



ఏవోబీ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది(ఫైల్)

- గిరిశిఖర, ఏఓబీ గ్రామాల్లో యథేచ్ఛగా తయారీ
- ఛిద్రమవుతున్న బతుకులు
- జిల్లా కేంద్రంలో సారాకు కరువు లేదు

పార్వతీపురం టౌన్:

ఓ వైపు ప్రభుత్వ వైఫల్యం, మరోవైపు ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజారోగ్యానికి తూట్లు పడుతున్నాయి. గత ఏడాదిన్నర కాలంగా పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు, పారిశుద్ధ్య లోపం, తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న మన్యం వాసులకు సారా కష్టాలు మరిన్ని ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. మన్యం జిల్లా వ్యాప్తంగా, ఏఓబీ గ్రామాల్లో, గిరిజన సీమల్లో, గిరిశిఖర గ్రామాల్లో సారా ఏరులై పారుతోంది. సారా అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. అనేక గ్రామాల్లో, పట్టణాల్లో బహిరంగంగానే క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో ఏఓబీ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలు కుటీర పరిశ్రమలుగా ఏర్పడ్డాయి. విస్తారంగా వర్షాలు కురుస్తుండడం, గెడ్డలు, వాగులు, నిండుగా ప్రవహిస్తుండడంతో ఆయా ప్రాంతాలను వ్యాపారులు తమకు అనువుగా మార్చుకుని బెల్లపు ఊటలను తయారు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అక్రమంగా సారాను తయారు చేస్తూ జిల్లా కేంద్రంగా అనేక జిల్లాలకు దాటిస్తున్నారు. నెలలో ఏదో ఒకరోజు ఎక్సైజ్ అధికారులు మేమున్నామంటూ తూతూ మంత్రంగానే దాడులు నిర్వహిస్తూ మమ అని చేతులు దులుపుకుంటున్నారు. పూర్తిస్థాయిలో నిఘా లేకపోవడంతో మన్యం జిల్లా సారా క్రయ విక్రయాలకు, అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

ఎలా అంటే..

సారా వ్యాపారంలో పెట్టుబడి తక్కువ. లాభాలు ఎక్కువ ..కష్టం కూడా తక్కువగానే ఉండడంతో ఈ వ్యాపారాన్ని అనేక మంది వృత్తిగా మలుచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పార్వతీపురం, సీతంపేట, ఏజెన్సీ ప్రాంతాల్లో సారా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నచందంగా మారింది. జిల్లా కేంద్రంలోనే యథేచ్ఛగా సారా విక్రయాలు జరుగుతున్నాయంటే ఇక మారుమూల గిరిజన గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహాతీతం. జిల్లాలోని ఏఓబీ గ్రామాలు, మారుమూల గిరిజన గూడలు, తదితర గ్రామాల పరిసరాల్లో సారా తయారీ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల ఈ గిరిజన గ్రామాల పరిసరాల్లోనే ఎక్సైజ్‌శాఖ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఈ ప్రాంతాల్లో మరీ సారా ఎక్కువగా తయారు చేస్తూ అక్రమ వ్యాపారులు ఎక్సైజ్ అధికారులకు సవాల్ విసురుతున్నారు.

బతుకులను ఛిద్రం చేసుకుంటున్నారు..

గిరిజన గ్రామాల్లో ఆదివాసీలకు సారాకు మధ్య విడదీయరాని బంధం ఏర్పడింది. శుభకార్యాలు, పండగల సమయాల్లో ఎక్కువగా మద్యాన్ని తాగుతారు. గిరిజన ప్రాంతాల్లో నిత్యం లభించే సారాను కొందరు అవసరానికి మించి వినియోగిస్తున్నారు. మద్యం దుకాణాల్లో ఎక్కువ నగదు చెల్లించి కొనుగోలు చేయలేని మందుబాబులు తక్కువ ధరకే లభించే సారాకు అలవాటు పడుతున్నారు. దీనికి బానిసలై బతుకులను ఛిద్రం చేసుకుంటున్నారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థాయిలో పెద్దగా అవగాహన సదస్సులు నిర్వహించడంలేదు. దీంతో గిరిజనుల్లో చైతన్యం కొరవడింది.

అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లా వ్యాప్తంగా సారా ప్రభావిత గ్రామాలను గుర్తించాం. ఆగ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించి గిరిజనులను చైతన్యవంతులం చేస్తున్నాం. సారా రవాణా, తయారీ, అమ్మకాలపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తున్నాం.

- ఎ.సంతోష్, ఎక్సైజ్ ఏఈఎస్, పార్వతీపురం మన్యం

ముడిసరుకుల విక్రయాలకు అడ్డే లేదు...

సారా తయారీకి వినియోగించే ముడిసరుకులు బెల్లం, పటిక, అమోనియా, నవాసారం వంటి వాటిని ఎక్కువగా మైదాన ప్రాంతాల్లో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు తమ గొడౌన్లలో నల్ల బెల్లాన్ని నిల్వ చేస్తున్నారు. రాత్రివేళ క్వింటాళ్ల లెక్కన వాటిని వ్యాన్లలో లోడ్ చేసి సారా ప్రభావిత గ్రామాల్లోని వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు.

జరిగేదంతా రాత్రివేళలోనే ..

గిరిజన ప్రాంతాల్లో తయారు చేసిన సారాను కొంతమంది వ్యాపారులు రాత్రివేళ ఆటోలు, బైక్‌ల ద్వారా మైదానంలోని పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మన్యంలో సరిహద్దు గ్రామాలైన జయకోట, బొత్తరాపల్లి, మూలకర్ని, విక్రాంపురం, అలమండ, సోరుపల్లి, సందుబడి. రేగులపాడు, సంబలబాయి, ఎగువ పిల్లిడ్డి, జీడివలస, అత్తిగడ, జగ్గాడ, టికరపాడు, కప్పలాడ, మానిక్యవలస, ఎడుగువ్మ లవలస, పోల్ల, చిన్నబగ్గ, కడగండి, ఓంద్రుజోల, వలగజ్జి గ్రామాల మీదుగా జనసంచారం లేని మార్గాలగుండా సారా తరలిస్తున్నారు. పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల్లో పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచి ప్లాస్టిక్ కేన్లలో సారా రవాణా చేస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖ నిఘా కొరవడింది. దీంతో రోజుకు కొన్ని వేల లీటర్ల సారా రవాణా అవుతోంది.

మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ వరప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: ప్రతి విద్యార్థి మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే చదివినది గుర్తుంటుందని ప్రిన్సిపాల్ వరప్రసాద్ తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని, మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలురు పాఠశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమేనన్నారు. అందరూ ఒత్తిడిని జయించేందుకు మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ప్రశాంతమైన జీవనం సాగించామన్న భావన, మనసుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో మానసిక ఆరోగ్యం ప్రతిజ్ఞ చేయించారు.

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలురు పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రేవళ్ల అనంతరావు..మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు చేయాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు.

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పైల శంకరరావు నేతృత్వంలో మానసిక ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడికి దూరంగా ఉండాలని, మానసిక ప్రశాంతత చేకూర్చుకోవాలని ఆయన తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పాలకొండ రూరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ఆ దిశగా అందరూ అడుగులు వేయాలని ఆధ్యాత్మిక వక్త భాస్కరనాయుడు అన్నారు. మండలంలోని బుక్కూరు రామ మందిరం వద్ద శుక్రవారం జరిగిన సత్సంగం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ప్రతిఒక్కరూ బిజీ జీవితంలో పడిపోయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు చాలా తక్కువ సమయం కేటాయిస్తున్నారని, అందరూ తమకున్న సమయంలో కొంత సమయాన్ని దైవ కార్యక్రమాలకు కేటాయించాలన్నారు.

అనంతరం సామూహిక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వంజరాపు కొండలరావు, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలి



ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌టీలు

భామిని: గురుకులాల్లో పనిచేసే సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేస్తూ వారు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఏకలవ్య ఆదర్శ పాఠశాల అదనపు వసతిగృహాల నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిసి తమ సమస్యలు విన్నవించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్.రాజేష్, ఐటీడీఏ ఏఈ సింధూజ పాల్గొన్నారు.

బంగార్రాజుకు ఘనంగా నివాళులు



బంగార్రాజు స్థూపం వద్ద జోహార్ బంగార్రాజు అని నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బీరుపాడు పంచాయతీ, ఇజ్జకాయి గ్రామంలో సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ కామ్రేడ్ కిల్లక బంగార్రాజు పదో వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులంతా కలిసి బంగార్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. గిరిజన సమస్యలపై బంగార్రాజు అలుపెరుగని పోరాటం చేశారని, ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల నాయకుడు పువ్వల తిరుపతిరావు కోరారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



విద్యార్థులను ప్రశ్నలడిగి వారి విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ట్రైకార్ ఎండీ సీఏ మణికుమార్

గుమ్మలక్ష్మీపురం: ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటి సాధన దిశగా అడుగులు వేయాలని ట్రైకార్ ఎండీ, పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ సీఏ మణికుమార్ సూచించారు. మండలంలోని టిక్కబాయి, కొత్తగూడల్లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలు సహా భద్రగిరి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. అలాగే వివిధ ప్రశ్నలడిగి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు అంచనా వేసి, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూవో రజని తదితరులు ఉన్నారు.

అక్రమంగా కలప తరలింపు



పర్మిట్ లేక నిలిచి టేకు కలప లారీ

జియ్యమ్మవలస రూరల్: మండలంలో అక్రమంగా టేకు కలప తరలింపు జరుగుతోంది. శుక్రవారం బీజేపురం, బొమ్మిక గ్రామాల మధ్య ఓ లారీలో కలప దుంగలు తరలిస్తుండడాన్ని పలువురు చూసి ఇలా అక్రమంగా కలప రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదేంటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కలప రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీవరం, అధ్యాపకులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎల్విన్‌పేట మూడు రోడ్ల జంక్షన్ వరకు సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ఇటీవల చేసిన జీఎస్టీ శ్లాబ్‌ల సవరణ ద్వారా వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం వివరించారు. సెప్టెంబరు 22వ తేదీ నుంచి సవరించిన జీఎస్టీ శ్లాబ్‌లు అమలులోకి వచ్చాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు శ్రీవాణి, తులసి, సత్యారావు, చిన్నారావు, కృష్ణారావు, జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

జియ్యమ్మవలస రూరల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం బొంతాడ శివున్నాయుడు ఆకాంక్షించారు. మండల కేంద్రంలో వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, అప్పుడే మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తారన్నారు. రుణాల వసూళ్లు సక్రమంగా చేపట్టాలన్నారు.

అంతర పంటల సాగుపై అవగాహన

వీరఘట్టం: మండలంలోని కంబర, చలివేంద్రి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించి, అంతర పంటల సాగుపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి జె.సౌజన్య మాట్లాడుతూ పొలంగట్లు, ప్రధాన పంటలలో అపరాలను అంతర పంటలుగా సాగు చేసుకోవాలని తెలిపారు. అంతర పంటలతో అదనపు ఆదాయం సంపాదించవచ్చన్నారు. అనంతరం దశపర్ని కషాయం తయారీని రైతులకు వివరించారు.

కోటి సంతకాలకు సమాయత్తం కావాలి



బాలేరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణకు సమాయత్తం కావాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. మండలంలోని బాలేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం సమావేశమైన ఆమె..నిరుపేద విద్యార్థులకు వైద్యవిద్యను దరిచేయాలన్న సదుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడితే వాటిని ప్రైవేటుకు అప్పగించి నిర్వీర్యం చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. దీనిని మనమంతా ఖండించాలని, ప్రజల మద్దతు కూడా కూడగట్టుకోవాలన్నారు.

ప్రతి గ్రామంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించవద్దని పిలుపునిస్తూ సంతకాలు సేకరించాలని పార్టీ నేతలను ఆదేశించారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ కమిటీలకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, యూత్ కన్వీనర్ జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలి



బొడ్డగూడలో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న వాస్సన్ స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, గ్రామస్తులు

భామిని: ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రం చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని వక్తలు తెలిపారు. మండలంలోని బొడ్డగూడలో వాస్సన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. వాస్సన్ ప్రోగ్రాం ఆఫీసర్ కల్యాణ్ పాత్రో ఆధ్వర్యంలో గ్రామస్తులతో పరిసరాలను శుభ్రం చేయించారు. పాఠశాల పరిసరాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడం, తాగునీరు, మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడం వంటి పనులు చేపట్టారు.

● సీహెచ్‌సీ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?



కురుపాం సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం) నూతన భవన నిర్మాణం పూర్తి ఎప్పుడా అని కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరై ప్రారంభమైన ఈ భవన నిర్మాణం..చివరి దశలో నిలిచిపోయిందని, ఇదే గనక పూర్తయితే వైద్యసేవలకు ఇబ్బందులు తొలగుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పూర్తి కావాల్సిన నిర్మాణాలు ఇంకా వినియోగంలోకి రావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. -కురుపాం